epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

# టీ-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

MEDIA

మెయిన్ : శుక్రవారం - సెప్టెంబర్ 14- 2023 - పేజీలు - 5

టీ-మీడియా ఆన్‌లైన్ సర్వీసెస్

తెలంగాణ ప్రభుత్వం విదేశీ చదువుల కోసం అన్ని కులాల విద్యార్థులకు ఇచ్చే తిరిగి చెల్లింపు లేని రూ. 20 లక్షల పథకం, వివరాలు మరియు ప్రాసెసింగ్ చేయించబడును.

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు: 8500515365

## ఆర్టీసీ విలీనం బిల్లుకు గవర్నర్ తమిళిసై ఆమోదం

**టీ మీడియా, సెప్టెంబర్ 14, హైదరాబాద్ :**



టీఎస్ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదం తెలిపారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు, కార్మికులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లుకు నెల రోజుల తర్వాత గవర్నర్ ఆమోదం తెలిపారు. తాను చేసిన 10 సిఫారసుల విషయంలో ప్రభుత్వ స్పందనపై సంతృప్తి చెందినట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఆరు దశాబ్దాలకు పైగా కార్పొరేషన్‌గా కొనసాగిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తూ సీఎం కేసీఆర్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయంతో 43 వేల 373 మంది ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో కేసీఆర్ వెలుగులు నింపారు. నెల రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టి, ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలుపడంతో.. ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ కార్మికుల ఆకాంక్ష ఫలించింది.తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఆర్టీసీ నష్టాలను పూడ్చుకుంటూ క్రమంగా లాభాల్లోకి తెచ్చే క్రమంలో కరోనా వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా కేసీఆర్ వెనుకడుగు వేయలేదు. వేలాదిమంది ఉద్యోగుల జీవితాలతో ముడి పడి ఉన్నందున ఆర్టీసీని ఆదుకోవాలని కేసీఆర్ నిర్ణయించారు. లక్షలాదిమంది ప్రజలను వారి గమ్యస్థానాలకు చేరుస్తూ జనం హృదయాల్లో ఆత్మీయ చిరునామాగా నిలిచిన ఆర్టీసీకి అండదండలు అందించారు.



## జాతీయం ప్రతిపక్ష కూటమి 'ఇండియా' పై ప్రధాని వ్యాఖ్యలు

**టీ మీడియా, సెప్టెంబర్ 14, న్యూఢిల్లీ :**

ప్రతిపక్ష కూటమి 'ఇండియా' సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని భావిస్తోందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఎన్నికల సందర్భంగా మధ్యప్రదేశ్ బినాలో గురువారం ప్రధాని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సనాతన ధర్మంపై డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై స్పందించారు. " ఇటీవల వారు ముంబయిలో సమావేశం నిర్వహించారు. అక్కడ అహంకార కూటమిని ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే రాజకీయ వ్యూహాన్ని నిర్ణయించుకున్నారు. రహస్యంగా అజెండాను కూడా ఖరారు చేసుకున్నారు. భారతీయ సంస్కృతిపై దాడి చేయడమే వారి వ్యూహం" అని అన్నారు. భారతీయుల విశ్వాసాలపై దాడి చేయాలని, వేల ఏళ్లుగా దేశాన్ని ఐక్యంగా నిలిపిన విశ్వాసాలు, విలువలు, సాంప్రదాయాలను అంతంచేయాలని నిర్ణయించుకున్నారని ఆరోపించారు.

# 2024 ఎన్నికలలో టీడీపీ, జనసేన కలిసి పోటీ

**- పవన్ కళ్యాణ్**

**టి మీడియా,సెప్టెంబర్ 14,రాజమండ్రి:**



2024 ఎన్నికల్లో టీడీపీతో కలిసే జనసేన వెళ్తుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో ములాఖత్ అనంతరం ఎమ్మెల్యే బాలకృష్ణ, మాజీ మంత్రి నారా లోకేష్ తో కలిసి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తమతో పాటు బీజేపీ కలిసి వస్తుందని భావిస్తున్నామన్నారు. ఏపీలో అరాచక పాలనలో భాగంగానే చంద్రబాబును అరెస్ట్ చేశారు. చంద్రబాబుకు సంఘీభావం చెప్పేందుకే వచ్చానన్నారు.

టీడీపీతో కలిసి పనిచేయాలని ఇప్పుడే నిర్ణయించుకున్నానని తెలిపారు.బ్యాంకులో సిబ్బంది చేసిన తప్పునకు బ్యాంకు మేనేజర్‌ని తప్పుబడుతామా ? ప్రతి విషయాన్ని సీఎంకి లిక్ చేస్తామా. గతంలో దీన్ని గుజరాత్ లాంటి రాష్ట్రంలో కూడా అమలు చేశారు. హైదరాబాద్ సంపూర్ణమైన సిటీ నిర్మించిన వ్యక్తికి 300 కోట్ల రూపాయల స్కామ్‌ను చుట్టి ఇలా జైల్లో పెట్టడం బాధకలిగించిందన్నారు. తీవ్రమైన నేరాలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇతరులపై నేరాలు మోపుతూ జైల్లో పెడుతున్నారన్నారు.

తాను తీసుకునే నిర్ణయాలు చాలా మందికి బాధ కలిగిస్తాయన్నారు. 2014లో కూడా ఇలాంటివి విన్నానన్నారు. దేశానికి బలమైన నాయకుడు కావాలనే ఉద్దేశంతోనే మోడీకి అప్పట్లో మద్దతు తెలిపాను. 2019లో పాలసీ విధానంతోనే చంద్రబాబుతో విభేదించాను. తాను ఓ నిర్ణయం తీసుకుంటే వెనక్కి తిరిగి చూడనన్నారు. సీఎం జగన్ అవినీతి తిమింగళం అని.. ఆయన ఇతరులపై అవినీతి కేసులు మోపడం ఏంటీ అని పవన్ కళ్యాణ్ అడిగారు. జగన్ కు మిగిలింది ఆరు నెలలే అన్నారు. లిక్కర్ పాలసీలో 1/3 వైసీపీ నేతల జేబుల్లోకి వెళుతుందని ఆరోపించారు.

డిజిటల్ పేమెంట్స్ ఎందుకు తీసుకోవడం లేదని.. డైరెక్ట్ క్యాష్ అడగడంలో ఆంతర్యం ఏంటీ అని మండిపడ్డారు. రోడ్లు వేయవు, బెదిరిస్తావు.. అని సీఎం జగన్‌పై పవన్ విరుచుకుపడ్డారు.భూ కబ్జాలు జరుగుతున్న ఒక్కరిపై కేసు ఫైల్ చేయడం లేదని మండిపడ్డారు..

## తల్లితో కలిసి నేడు ఢిల్లీకి లోకేష్

**- ఏపీలో పరిస్థితులపై జాతీయ మీడియాకు ప్రజెంటేషన్ ?**

**టీ మీడియా, సెప్టెంబర్ 14, హైదరాబాద్ :**



చంద్రబాబు నాయుడి అరెస్ట్ అక్రమం అనే విషయంపై జాతీయ స్థాయిలో మీడియాకు ప్రజెంటేషన్ ఇవ్వాలని.. ఏపీలో ఉన్న పరిస్థితులను వివరించాలని నారా లోకేష్ నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. శుక్రవారం ఢిల్లీకి వెళ్లి ఈ అంశంపై జాతీయ మీడియాకు ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. చంద్రబాబు అరెస్ట్ విషయంలో జాతీయ స్థాయిలో స్పందన వచ్చింది. చంద్రబాబును రాజకీయకక్షోనే అరెస్టు చేశారని అనేక పార్టీల నేతలు ప్రకటించారు. జాతీయ మీడియా కూడా ఈ ఘటనపై విస్తతంగా కవరేజీ ఇస్తోంది. దీంతో చంద్రబాబు మొత్తం ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఏపీ పరిస్థితులపై జాతీయ మీడియాకు ప్రజెంటేషన్. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి కాలంలో దాడులు చేసిన వారిని వదిలేసి బాధితులపైనే కేసులు పెడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నాయి. నాలుగేళ్ల కాలంలో ఏపీలో జరిగినన్ని అరాచకాలు దేశంలో ఎక్కడా జరిగి ఉండవని, వాటన్నింటినీ మీడియాకు వివరించాలని అనుకుంటున్నారు. టీడీపీ ఆఫీసుపై దాడి చేసిన వారిపై ఒక్క కేసు కూడా పెట్టకపోవడం, అంగళ్లు, పుంగనూరులో చంద్రబాబు ర్యాలీపై రాళ్ల దాడులు చేసి.. తిరిగి చంద్రబాబుపైనే హత్యాయత్నం కేసులు నమోదు చేయడం వంటి వాటిని లా అండ్ ఆర్డర్ పూర్తిగా దారి తప్పిన పరిస్థితుల్ని జాతీయస్థాయిలో హైలెట్ చేయాలని లోకేష్ అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. ఏపీలో వ్యవస్థలన్నింటికీ కుప్పకూల్చిన వైనాన్ని వివరించే అవకాశం. అదే సమయంలో ఆధారాలు లేని కేసుల్ని ప్రతిపక్ష నేతలపై ఎలా మోపుతున్నారో కూడా వివరించనున్నట్లుగా చెబుతున్నారు. వ్యాపార సంస్థలపై ప్రభుత్వం జరిపినదాడులు మార్గదర్శి వంటి సంస్థలు అమరరాజా వంటి దేశానికి ప్రాముఖ్యత తెచ్చిన సంస్థలపై జరిగిన దాడుల గురించీ వివరించి అరాచక పాలన గురించి వివరిస్తారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. వ్యవస్థల్ని పూర్తి స్థాయిలో నాశనం చేసి న వైనాన్ని వివరించే అవకాశాలు ఉన్నాయి. 73 ఏళ్ల వయసులో ఉన్న చంద్రబాబును పధ్నాలుగేళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసినా ఎఫ్ఐఆర్‌లో కూడా పేరు లేకుండా గవర్నర్ అనుమతి లేకుండా కనీసం నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేసిన వైనాన్ని జాతీయ స్థాయిలో చర్చకు పెట్టే అవకాశం ఉంది. హెూంమంత్రి అమిత్ షాను కూడా కలిసే అవకాశం. కుదిరితే హెూంమంత్రి అమిత్ షాను కూడా కలుస్తారని విశ్వసనీయ సమాచారం. ఈ అంశంపై స్పష్టత లేదు. కానీ ఏపీలో పరిస్థితుల్ని ఢిల్లీలో అందరి ముందు పెట్టాలని నారా లోకేష్ గట్టిగా నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

## ప్రభుత్వ వైద్య కళాశాల.... ప్రారంబించిన మంత్రులు

**- ఈ ఏడాది నుండి తరగతులు**

**టి మీడియా, సెప్టెంబర్ 14,ఖమ్మం:**



నగరంలోని పాత కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీష్ రావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ లు గురువారం లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. 100 సీట్లతో ఈ సంవత్సరం నుండే కళాశాల ప్రారంభం కానున్నట్లు, నేటి నుండి తరగతులు ప్రారంభం కానున్నట్లు వారు తెలిపారు. రూ. 8.5 కోట్లతో పాత కలెక్టరేట్, పౌరసరఫరాలు, గిరిజనాభివృద్ధి అధికారి, రోడ్లు భవనాల శాఖల కార్యాలయాలను వైద్య కళాశాల, హాస్టళ్లకు అనుగుణంగా రెనోవేషన్ చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య కళాశాలలో సమకూర్చిన ల్యాబ్ లు, విద్యార్థులకు హాస్టల్, మౌళిక సదుపాయాల కల్పనలు మంత్రులు పరిశీలించారు. జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రాంత పిల్లలకు వైద్య సీట్లు ఎక్కువగా పొంది, మన ప్రాంతం నుండి వైద్యులు ఎక్కువగా తయారవ్వాలని ప్రభుత్వం దృఢసంకల్పంతో తీసుకున్న నిర్ణయమని వారు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో వైద్య, ఆరోగ్య రంగాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. బిడ్డ కడుపులో పడగానే, న్యూట్రిషన్ కిట్, ప్రసవం కాగానే కేసీఆర్ కిట్ ను ప్రభుత్వం అందిస్తున్నదని మంత్రి అన్నారు. ఈ పథకాలతో గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 30 శాతం జరిగే ప్రసవాలు, నేడు 76.8 శాతానికి చేరుకున్నాయన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రం సమకూర్చాలని రవాణా శాఖ మంత్రి కోరగా, త్వరలో అందజేయనున్నట్లు వైద్య ఆరోగ్య మంత్రి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల సేవాలు అందజేస్తున్నట్లు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, లోకసభ సభ్యులు నామా నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర రెడ్డి, తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, జెడ్పి చైర్మన్ లింగాల కమలరాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. రాజేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పుతిన్‌ను ఉత్తరకొరియాకు ఆహ్వానించిన కిమ్

**టీ మీడియా, సెప్టెంబర్ 14, మాస్కో:**



రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ తమ దేశానికి ఆహ్వానించినట్లు స్థానిక మీడియా కెసిఎన్ఏ గురువారం తెలిపింది. పుతిన్‌తో జరిగిన సమావేశంలో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు మరో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాయని కిమ్ పేర్కొన్నారు. రాబోయే 100 ఏళ్ల పాటు స్థిరమైన, భవిష్యత్ ప్రణాళిక లక్ష్యాలను సాధించేందుకు కిమ్ సుముఖత వ్యక్తం చేసినట్లు వెల్లడించింది. ప్రత్యేక రైలులో మంగళవారం రష్యాకు చేరుకున్న కిమ్ ప్రస్తుతం ఆ దేశంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలసి ఆయన రష్యన్ సుదూర తూర్పు ప్రాంతమైన అమూర్‌లోని రష్యన్ అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రం (సోయజ్-2)ను సందర్శించారు. అనంతరం ఈ ఇరువురు నేతలు తమ ప్రతినిధి బృందాలతో కలసి గంటకు పైగా చర్చలు జరిపారు. కిమ్ ఆహ్వానాన్ని పుతిన్ అంగీకరించారని కెసిఎన్ఏ పేర్కొంది. రష్యా, ఉత్తరకొరియాల మధ్య స్నేహం, చారిత్రక సాంప్రదాయాలను స్థిరంగా కొనసాగించాలనే తన సంకల్పాలన్ని పుతిన్ పునరుద్ఘాటించినట్లు తెలిపింది. అయితే ఈ పర్యటన ఎప్పుడు ఉండనుందనే విషయాన్ని వెల్లడించలేదు.

## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**- మంత్రి జగదీష్ రెడ్డి**

**టీ మీడియా, సెప్టెంబర్ 14, సూర్యాపేట :**



మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ రాబోయే వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహనే కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి..జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌లతో కలిసి గిదర్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..ప్రకృతి హితమే పండగల పరమార్థం అన్నారు.పండగలతో సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా తీసుకోవాల్సిన తరుణమిదేనని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతిలో ప్రకృతి ఆరాధనకే అధిక ప్రాధాన్యత ఉందన్నారు. పండుగుల వెనుకున్న లక్ష్యం కూడా అదే అని మంత్రి పేర్కొన్నారు. కావున వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కనబెట్టి, పర్యావరణ హిత గణపతులకు ప్రాధాన్యమిచ్చి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం ను అందిద్దాం అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు, డీఎస్పీ నాగభూషణం, చివ్వెంల జడ్పీటీసీ సంజీవ నాయక్, శ్రీనివాస్ గౌడ్, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీని జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకట్రావు, పీసీబీ ఈ.ఈ సురేష్ బాబు తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో 2 వేల విగ్రహాలు చిన్నవి, 125 పెద్ద విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

# సింగరేణి లో ఎన్నికలు వాయిదా వేసే కుట్ర జరుగుతోంది



**టీ మీడియా, సెప్టెంబర్ 14, గోదావరిఖని :** సింగరేణి లో ఆరవ సారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఆరేండ్లు కావస్తుందని, కాలపరిమితి ముగిసినా కూడా ఒకే యూనియన్ గుర్తింపు కొనసాగడం అన్యాయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కే.స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ లు పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో జరిగిన ఏఐటియుసి కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ... ప్రజాస్వామ్య ప్రక్రియగా జరుగవలసిన ఎన్నికల గురించి ఏఐటీయూసీ యూనియన్ కోర్టునాశ్రయించవలసిన దుస్థితి ఏర్పడిందని వారు అన్నారు. సింగరేణి లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నో సార్లు విజ్ఞప్తులు చేసినా యాజమాన్యం ఏదో ఒక కుంటి సాకు తో వాయిదా వేస్తూ అధికార పార్టీ తాబేదార్ల కు లబ్ది చేకూరేలాగా ప్రవర్తిస్తుందని వారు విమర్శించారు. ఏఐటియుసి పట్టుబట్టి చేస్తున్న ప్రయత్నాల వల్ల కదలిక వచ్చి ఈ నెల 11న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ హైదరాబాద్ వద్ద చర్చలు జరుగగా వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని ఏఐటీయూసీ, బి.ఎం.ఎస్ యూనియన్ లు డిమాండ్ చేసినాయని వారు తెలిపారు. కానీ ఇతర సంఘాలు, యాజమాన్యం మళ్ళీ ఈ నెల 22 కు సమావేశం వాయిదా వేయాలని చెప్పారని వారు తెలిపారు. తత్ఫలితంగా తాత్సారం జరిగి ఎన్నికలను వాయిదా వేసే ప్రయత్నాలు జరగటాన్ని ఏఐటీయూసీ ఖండిస్తున్నదని వారు పేర్కొన్నారు. సింగరేణి లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగేంతవరకు అన్ని కార్మిక సంఘాల కు తక్షణమే సమాన ప్రాతినిధ్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం పేరుతో కొందరు చేస్తున్న ఆగడాలు ఇకముందు సాగవని, అంకిత భావం, కార్మిక పక్షపాతి గా చరిత్ర కలిగిన ఏఐటీయూసీ నాయకుల పై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని, విధానాలపైన మాట్లాడే విజ్ఞత నేర్చుకోవాలని యాజమాన్యం తొత్తులకు వారు సూచించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు ఎస్ వెంకట్ రెడ్డి, గౌతం గోవర్దన్, ఎం.ఎ.గౌస్, తాని రాజబాబు, బుర్ర భాస్కర్, పడాల కనకరాజు, కొంద్ర రాజయ్య, లక్ష్మీ నారాయణ, మోరే సమ్మయ్య, బూడిద మల్లేశ్, కాలువల జగన్, జైపాల్ రెడ్డి, నస్పూరి గట్టయ్య, ఆఫీసు కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్కినేని పురస్కారానికి ఎంపికైన ఖని కళాకారుడు



**టీ మీడియా, సెప్టెంబర్ 14, గోదావరిఖని :** వృత్తిరీత్యా హైదరాబాద్ లో ఉంటున్న గోదావరిఖనికి చెందిన ప్రముఖ కళాకారుడు, తార ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు సంకె రాజేష్ అక్కినేని అంతర్జాతీయ ప్రత్యేక పురస్కారానికి ఎంపికయ్యాడు. 2014లో అమెరికాలో స్థాపించబడిన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఈనెల 17న హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్న డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో అతిథులు ప్రఖ్యాత చలనచిత్ర నటులు, నిర్మాత మురళీమోహన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నాడు. ఈ మేరకు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తోటకూర ప్రసాద్, అధ్యక్షులు మురళి వెన్నెం, కార్యదర్శి రవి కొండబోలు నుండి రాజేష్ ఆహ్వాన పత్రాన్ని అందుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్ అకాడమీ సభ్యులుగా, నృత్యాంజలి బాధ్యులుగా, తార ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులుగా దాదాపు నాలుగు దశాబ్దాలుగా సాంస్కృతిక, కళా రంగానికి రాజేష్ అందిస్తున్న సేవలకుగాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ... వివిధ రంగాలలో లబ్ధ ప్రతిష్టులైన జస్టిస్ ఎన్వి రమణ, మాజీ ఎంపీ టి సుబ్బరామిరెడ్డి, సినీ నటులు, రచయిత, దర్శకులు తనికెళ్ల భరణి, తమ్మారెడ్డి భరద్వాజ, కోదండరామిరెడ్డి, రేలంగి నరసింహారావు, దగ్గుబాటి సురేష్ బాబు, ముప్పలనేని శివ, రోజారమణి, సినీ గేయ రచయితలు వద్దేపల్లి కృష్ణ, రామ జోగయ్య శాస్త్రి, అనంత శ్రీరామ్, సంగీత ఆచార్యులు, గాయకులు రామాచారి, వంశీ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వాహకులు వంశీ రామరాజు సరసన తాను అక్కినేని అంతర్జాతీయ పురస్కారం అందుకోనుండడం పట్ల రాజేష్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఖనికి చెందిన రాజేష్ అక్కినేని అంతర్జాతీయ ప్రత్యేక పురస్కారానికి ఎంపిక కావడం పట్ల స్థానిక కళాకారులు, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు.



## క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

**- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**టీ మీడియా, సెప్టెంబర్ 14, నడిగూడెం :** ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు కావాల్సిన అసలైన విద్య క్రీడలతోనే లభిస్తుందని కోదాడ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం క్రీడా స్ఫూర్తిని పెంచడమే లక్ష్యంగా నడిగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోదాడ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు లాంగ్ మార్చ్ తో ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవితాన్ని చదవడంలో క్రీడలదే ప్రముఖ పాత్ర అన్నారు. క్రీడా స్ఫూర్తిని తీసుకొని విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు.ప్రస్తుత ఆధునిక యుగం ఒత్తిడికి గురవుతున్న పిల్లలను బయట పడేయటంలో క్రీడలదే ప్రధాన పాత్ర అన్నారు. క్రీడలలో గెలుపు, ఓటముల ద్వారా వచ్చే అనుభవాలు జీవితంలో వచ్చే ఆటు, పోటులను తట్టుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడాకారులకు ఉపయోగపడే ఏ కార్యక్రమంలో అయినా నా భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. క్రీడలతో కూడిన పరిపూర్ణ విద్యకు కేరాఫ్ గా ను ప్రభుత్వ పాఠశాలలను తీర్చిద్దిద్ది కోదాడ నియోజకవర్గమును క్రీడా హబ్ గా తీర్చి దిద్దాలని పిలుపు నిచ్చారు. నిత్య జీవితంలో ఒత్తిడిని జయించాలన్నా, జీవితంలో ఎత్తుపల్లాలను ఎదుర్కోవాలన్నా క్రీడలు గొప్ప సాధనాలని అన్నారు. మానసిక ఉల్లాసం దేహ దారుఢ్యం తో పాటు క్రీడా స్ఫూర్తిని నింపుకోవడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. సూర్యాపేట జిల్లాలో వ్యాయామ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సొంత ఖర్చులతో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డివిజన్ స్థాయి క్రీడలను నిర్వహించి స్పోర్ట్స్ నిర్వహణ, క్రీడాకారులకు భోజనాలు ఏర్పాట్లు, క్రీడా దుస్తులు, ప్రైజులు తదితర ప్రతిదీ అన్ని తానే నిర్వహించిన ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సలిం షరీఫ్,స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి అజాంబాబా, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేశం, డివిజన్ అధ్యక్షులు గడ్డం వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ప్రకాష్, కార్యదర్శి నాగేశ్వరావు, ఎమ్మార్వో నాగేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్లు పుట్టా రమేష్, గోసుల రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు , క్రీడా అభిమానులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో బిజేపి నాయకులు నిరసన

**- పట్టణ బిజెపి అధ్యక్షులు బచ్చురాము**



**టీ, మీడియా, సెప్టెంబర్ 14, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర రాష్ట్ర బిజెపి అధ్యక్షులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నిరుద్యోగ సమస్యపై నిరుద్యోగ భృతి పై 24 గంటల ఉపవాస దీక్ష పూనుకోవడం జరిగింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ఒత్తిడితో రాత్రి కిషన్ రెడ్డి ని అక్రమంగా అరెస్టు చేయడం బిజెపి వనపర్తి జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తూ రాజీవ్ చౌక్ నందు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ముఖ్యమంత్రి ఇంటికో ఉద్యోగం వస్తుందని తెలంగాణ నిరుద్యోగ యువకుల భవిష్యత్తు బాగుంటుందని అందుకే తెలంగాణ రాష్ట్రం కావాలని రెచ్చ కొట్టి అనేక మంది విద్యార్థుల యువకుల ప్రాణాలు త్యాగం చేశారు. వారి ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది రాష్ట్ర మేర్పడ్డాక ఇంటికో ఉద్యోగం కాదు కదా ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదు. కొన్ని ఉద్యోగాలు ప్రకటిస్తే అవి పోలీస్ కేసులు కావాలని రిటర్మెంట్ అయ్యే వయసు పెంచడం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడం ఈరోజు నిరుద్యోగ యువకులకు అదే విధంగా పరీక్షలు రాసిన విద్యార్థులకు అనేక ఇబ్బందులు గురిచేస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసినందుకు నిరసనగా కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి ఉపవాస దీక్ష చేయడం జరిగింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు అక్రమ అరెస్టులను చేయడం బిజెపి వనపర్తి జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుంది. గతంలో కేంద్రమంత్రి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల యొక్క పరిశీలనకు వెళ్లడానికి పోతుంటే కూడా వర్షంలో ఆపి మరీ అరెస్టు చేయడం జరిగింది. కాబట్టి ఈ యొక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత ధోని అవలంబిస్తుంది. ఈ విషయంలో తెలంగాణ ప్రజలు విద్యార్థులు యువకులు అన్ని వర్గాల ప్రజలు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక అన్ని వర్గాల ప్రజలు బాగుపడింది ఏమీ లేదు బంగారు తెలంగాణ అంతా కూడా గెలిచినటువంటి ఎమ్మెల్యేలు మంత్రులకే దక్కింది. కాబట్టి వెంటనే నిరుద్యోగ సమస్యను నిరుద్యోగ భృతిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిజెపి కోరుతున్నది

ఈ కార్యక్రమంలో వనపర్తి బిజెపి అధ్యక్షులు బచ్చురాము ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు బి కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, పార్లమెంట్ ఫుల్ టైమర్ బుడ్డన్న, నాగర్కర్నూల్ పార్లమెంట్ కోకన్వీనర్ జింకల కృష్ణయ్య, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర రెడ్డి, కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పరశురాం, రామ్మోహన్, చిత్తారి ప్రభాకర్, శివారెడ్డి, జిల్లా బిజెపి అధికార ప్రతినిధి పెద్దిరాజు, దళిత మోర్చా అధ్యక్షులు కుమార్, మైనార్టీ అధ్యక్షులు కరీం, సీనియర్ నాయకులు చాపత్త గోపి, వెంకటేష్ నాయుడు, కొండన్న, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాము, నందిమల్ల రవి, రాయన్నసాగర్, యువమోర్చా అధ్యక్షులు తిరుమలేష్, అరవింద్ కిషన్, మోర్చా నాయకులు జ్ఞానేందర్, బాహుబలి రఘు, మహేష్ రాములు, చుక్క సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## డబ్బు ఎక్కువ వుంది అని చదువు ఆపొద్దు'

**- అదే చదువు డబ్బు లేక ఆగిపోవద్దు**

**- ఎమ్మెల్యే కందాళ**



**టీ మీడియా, సెప్టెంబర్ 14, ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర వైద్య,ఆరోగ్య %ఉ% ఆర్థిక శాఖ మంత్రి వర్యులు తన్నీరు హరీష్ రావు ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ కందాళ ఉపేందర్ రెడ్డి తో పాటుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పువ్వాడ అజయ్ కుమార్ ఎంపీలు నామా నాగేశ్వరరావు వద్దిరాజు రవిచంద్ర,ఎమ్మెల్సీ తాత మధుసూదన్,పల్లా రాజేశ్వర్ రెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు,డీసీసీబీ చైర్మన్ కురాకూల నాగభూషణం, విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు,రైతు సమన్వయ సమితి చైర్మన్ నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్, సీపీ .విష్ణు వారియర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన తెలంగాణ వచ్చాక,రాష్ట భవిష్యత్తు చదువు పైనే ముఖ్యంగా ఆధారపడి వున్నది అనే సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మి కెసిఆర్ విద్యా రంగాన్ని ఒక ప్రత్యేక దృష్టితో నిజమైన దార్శనిక విజ్ఞతతో తెలంగాణలో శిధిలమైన విద్యా పునాదులను నిశితంగా పరిశీలించి ఏ విధంగా విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలి, ఎటువంటి మౌలిక వసతులు కల్పించాలి,ఎన్ని కొత్త విద్యాసంస్థలు నిర్మించాలి,అనేటువంటి అన్ని రకాల అంశాలను పరిశీలించి, అంగన్వాడీ నుండి ప్రైమరీ స్కూల్ వరకు గురుకులాల నుండి వేద పాఠశాలల వరకు ఇంటర్ కాలేజీల నుండి ఉన్నత విద్యలైన మెడిసిన్, ఇంజనీరింగ్ ,నర్సింగ్ వరకు తెలంగాణ లో ఒక కొత్త విద్యా మోడల్ ని ప్రవేశపెట్టారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే మన మొదటి అక్షరమైన అ నుండి నేటి ప్రపంచ లక్ష్యమైన అమెరికా వెళ్లటానికి కావాల్సిన చదువులు అన్ని తెలంగాణలో వున్న ప్రతి నియోజకవర్గానికి చేరువ అయ్యేలా కెసిఆర్ కృషి చేస్తున్నారు. ఇంక నా మొదటి లక్ష్యం మన పాలేరు లో నియోజకవర్గంలో వున్న అందరి పిల్లలకు ఉన్నత విద్య అందించటం.సుమారుగా 40,000 వేల మంది విద్యార్థులు వున్నా మన పాలేరు నియోజకవర్గం లో అంగన్వాడీ నుండి పదవ తరగతి కి 30,0000 వేల మంది వున్నారు.ఇంటర్,డిగ్రీ,వృత్తి సంబంధింత కోర్స్ ల కోసం ఇప్పటికి జిల్లా దాటి వెళ్తున్న పరిస్థితి దీనిని మార్చాలని ఉన్నత చదువులు కూడా మనం మన నియోజకవర్గం లోనే,మన జిల్లాలోనే చదివే అవకాశం కల్పించే విధంగా నేను కృషి చేస్తాను.



## హిందూ,ముస్లిం పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

**- డిసిపి వైభవ్**

**టీ మీడియా, సెప్టెంబర్ 14, పెద్దపల్లి :** హిందూ,ముస్లింలు ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని పెద్దపల్లి డిసిపి వైభవ్ గైక్వాడ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని మూన్ ఫంక్షన్ హాల్లో పెద్దపల్లి జోన్ పోలీస్ శాఖ నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ... రాబోయే వినాయక చవితి, మిలాద్ ఉన్ నబి వేడుకలను హిందూ, ముస్లింలు ఆనందోత్స వాల మధ్య జరుపుకోవాలన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు కచ్చిత ంగా పోలీస్ శాఖ అనుమతి పొందాల న్నారు. మండపం వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి ఎడ్ల మహేష్,సిఐ అనిల్, జగదీష్,సత్య నారాయణ,చంద్ర శేఖర్, ప్రమోద్ రావు, ప్రసాద్, ఎస్ఐ లు మహేందర్,మల్లేష్ తో పాటు శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### రెండోరోజు కొనసాగుతున్న

## రిలే నిరాహార దీక్ష




**టీ.మీడియా, సెప్టెంబర్ 14, చింతూరు :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ చింతూరు మండల కేంద్రంలో నారా చంద్ర బాబు నాయుడు అక్రమ%శీ%గా అరెస్ట్ చే య ం డా న్ని ఖండిస్తూ,రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ఆదేశాల మేరకు, నియోజకవర్గం ఇన్చార్జి శ్రీమతి వంతల రాజేశ్వరి సూచనల మేరకు. రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు కొనసాగుతున్నాయి. గురువారం చింతూరు మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు ఓబులేం రామారావు చౌదరి కూనవరం తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి పోడియం అప్పారావు, సమక్షంలో రిలే నిరాహారదీక్ష ప్రారంభించడం జరిగింది. చింతూరు మండల జన సేన పార్టీ మండల అధ్యక్షులు మడివి రాజు, పయ్యాల నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇళ్ల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమాలు రాష్ట్ర ప్రజలు తెలియజేస్తున్నారన్నారు. మండల కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు గడ్డం సురేష్ తెలుగు యువత కార్యదర్శి శీలం తమ్మయ్య తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పొదిలి రామారావు, శ్రీరామ్ మూర్తి రెడ్డి కార్యదర్శి ముత్యాల శ్రీరామ్ చింతూరు మండలం క్లస్టర్ ఇంచార్జ్ ఓబులేని నరసింహారావు యూత్ నాయకులు కే.బాలకృష్ణ దూలయ, మీడియం కొండయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కే .చిన్నమత్తయ్య మండల నాయకులు అనిగి చంద్రయ్య, పసుపులేటి సల్మాన్ రాజు జనసేన నాయకులు పెద్ద, తీగల రవి, కన్నారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ డ్రైనేజీ సమస్య పరిష్కారం

**- మున్సిపల్ చైర్పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ**



**టీ మీడియా, సెప్టెంబర్ 14, కోదాడ :** కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం గ్రామం లో ఎన్నో యేళు ్ళగా తీవ్ర ఇబ్బంది పడుతున్న నేషనల్ హైవే 65 నుండి ఓల్డ్ హైవే 9 వరకు అస్తవ్యస్థ ఉన్నటు వంటి మురికి కాలువ పైన స్టోమ్ వాటర్ డ్రైన్ ని నిర్మించుటకు గాను కాలువని పరిశీలించి న కోదాడ మునిసిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ కందుల చంద్రశేఖర్, ఏఈ అంజలి, వర్క్ ఇన్స్పెక్టర్ నాగిరెడ్డి, చిత్తలూరి శివయ్య, చిత్తలూరి లక్ష్మీనారాయణ, వనపర్తి నర్సయ్య పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ : వ్యక్తి మృతి



**టీ మీడియా, సెప్టెంబర్ 14, రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గద్దె రేగడి ప్రాంతంలో మంచిర్యాల నుండి మందమరి వైపు వెళ్ళు జాతీయ రహదారిలో గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడం వలన గుర్తు తెలియని వ్యక్తి ప్లైవుడ్ షాప్ ఎదురుగా కిందపడి ఉండడం చూసి షాప్ యజమాని 100 కి,108 కి కాల్ చేసి మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మరణించడం జరిగింది. ప్రస్తుతం ఆ వ్యక్తి మృతదేహం మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ లో ఉంది. ఆ వ్యక్తి వయసు సుమారుగా 60 నుండి 70 మధ్య ఉంటుందని ఆర్కేపీకి నూతనంగా వచ్చిన ఎస్సై జి.రాజశేఖర్ తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712656572 కి ఫోన్ చేసి తెలుపగలరని ఎస్సై తెలిపారు.

## మండల పరిషత్ నిధులతో సిసీ రోడ్ పనులు



**టి మీడియా, సెప్టెంబర్ 14, మేళ్ళ చెరువు :** మేళ్లచెరువు మండలం కప్పల కుంట తండా గ్రామపంచాయతీ పరిధిలోగల దుబ్బ తండలో మండల పరిషత్ నిధుల నుండి 2 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు పనులను మేళ్లచెరువు ఎంపిపి కొట్టే పద్మ సైదేశ్వరరావు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణ , ఉప సర్పంచ్ బద్రు, మాజీ వార్డ్ మెంబర్ లావూరి బాలాజీ పటేల్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**యుపి యస్ స్కూల్ ఆకస్మిక తనిఖీ :**

మేళ్ళ చెరువు మండలం కప్పలకుంట తండ పరిధిలోని దుబ్బతండ లో ఉన్న యుపియస్ పాఠశాలను మేళ్ళ చెరువు ఎంపిపి పద్మా సైదేశ్వరావు తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

## పూసుకుంట గ్రామాన్ని సందర్శించిన తహసీల్దార్



**టి మీడియా, సెప్టెంబర్ 14, దమ్మపేట :** గురువారం ఉదయం తహసిల్దార్ ఎలక్షన్ ప్రిపరేటరీ వర్క్ లో భాగంగా పూసుకుంట గ్రామమును సందర్శించడం జరిగినది. ఈ ఆర్ వో, అశ్వరావుపేట దారి ఆదేశాల మేరకు పూసుకుంటలో గల పి వి టి జి ఓటర్ వివరాలు పరిశీలించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పూసుకుంట సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## వృద్ధునిపై గొడ్డలితో దాడి

**- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**



**టీ మీడియా, సెప్టెంబర్ 14, తిరుమలాయపాలెం :** వర్షపు నీరు పోకుండా వేసిన అడ్డుకట్టనీ తీస్తున్నారనే నేపథ్యంతో వృద్ధునిపై గొడ్డలితో తీవ్రంగా దాడి చేసి గాయపరచిన సంఘటన తిరుమలాయపాలెం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని లక్ష్మీదేవి పల్లి, తండా గ్రామపంచాయతీ పరిధిలోని జండాల తండా, గ్రామానికి చెందిన మూడు భారతీయ 65 సంవత్సరాల వృద్ధుడు తన వ్యవసాయ భూమి ఆవరణంలో వర్షం వచ్చినప్పుడు ఆ వర్షపు నీరు తన భూమి మీదుగా అవతల వైపు పోయే విధంగా గతంలో మోరి ఉండేది ఆ మోరీని లక్ష్మీదేవి పల్లి, గ్రామానికి చెందిన మూడ్ లింగ, తండ్రి పేరు బావ్ సింగ్, అనే వ్యక్తి సిమెంట్ కాంక్రీట్ తో ఆ మోరిని పూడ్చి వర్షపు నీరు పోకుండా అడ్డుకట్ట వేశారనీ. దానిని బాధితుడు భారతీయ, తొలగించారని కక్ష పెంచుకున్న నిందితుడు లింగ బుధవారం సుమారు సాయంత్రం 5:30 ప్రాంతంలో బాధితుడు భారతీయ, మూడ్ సిరికలు, అనే వ్యక్తి ఇంటి దగ్గర కూర్చొని మాట్లాడుతున్న సమయంలో నిందితుడు లింగ, గోడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచగా నిందితులపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

## బహిరంగ సభను పరిశీలించిన మంత్రులు



**టీ మీడియా, సెప్టెంబర్ 14, వనపర్తి బ్యూరో :** ఈ నెల 16 శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ కొల్లాపూర్ బహిరంగ సభకు సింగొటం చౌరస్తాలో సభా స్థలిని ప్రాజెక్టు పనులను పరిశీలించి అధికారులకు పలు అదేశాలు జారీచేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెం సర్పంచ్ ను అభినందించిన జిల్లా కలెక్టర్



**టీ మీడియా, సెప్టెంబర్ 14, తిరుమలాయపాలెం :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పథకంలో పారిశుద్ధం, శానిటేషన్, ఘన వ్యర్థాలు, కంపోస్టింగ్, భాగంలో కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అవార్డుల పంట పండిస్తుంది. ఖమ్మం జిల్లా పాలేరు డివిజన్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఆశీస్సులతో తిరుమలాయపాలెం మండలంలోని ,తిరుమలాయపాలెం గ్రామానికి బెస్ట్ గ్రామపంచాయతీ గా ఎన్నికైనందుకు, ఖమ్మం జిల్లా కలెక్టర్ గౌతమ్ చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ కొండ బాల వెంకటేశ్వర్లు పంచాయతీ సెక్రెటరీ సునీత అవార్డులు ప్రశంస పత్రాలు అందుకున్నందుకు, వారికి గ్రామ ప్రజలందరూ కూడా సంతోషం వ్యక్తపరిచారు.

## డెంగ్యూ జ్వరంతో ఇంటర్ విద్యార్థి మృతి



**టీ మీడియా, సెప్టెంబర్ 14, పెద్దపల్లి బ్యూరో :** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఆరేపల్లి గ్రామంలోని (మల్లయ్యపల్లె) గ్రామానికి చెందిన కోడి శ్యామ్. రజిత గార్ల కూతురు అశ్విత 16 సంవత్సరాలు మృతి చెందింది. అశ్విత వరంగల్ లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకుంటుంది. అయితే ఆమెకు జ్వరం రావడంతో తన సొంత ఊరు అయినా మల్లయ్య పల్లెకు వచ్చి నిన్న తల్లిదండ్రులతో కలిసి జమ్మికుంట లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చూపించి సాయంత్రం ఇంటికి తిరిగి తీసుకువచ్చారు. గురువారం ఆరోగ్యం మరింత క్షీణించు తొండడంతో మళ్లీ జమ్మికుంట హాస్పిటల్ కు బయలుదేరారు మార్గమధ్యలో అశ్విత ప్రాణాలు వదిలి చనిపోయింది ఇంత చిన్న వయసులోనే పాప చనిపోవడంతో గ్రామ ప్రజలు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ప్రతి ఒక్కరి కంట కన్నీరు పెట్టడం జరిగింది. %ఎ%మృతురాలికి, చెల్లి హర్షిత ఉన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారు డెంగ్యూ. మలేరియా. జ్వరాలతో ప్రతి గ్రామంలో దాదాపుగా చాలామంది జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని గ్రామాల్లో సందర్శించి ఆరోగ్య క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను విష జ్వరాల నుంచి కాపాడాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

## కిషన్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

**- బిజెపి మండల అధ్యక్షుడు నవీన్ రెడ్డి**



**టీ మీడియా, సెప్టెంబర్ 14, ఖిల్లా ఘనపురం:** ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ రెడ్డి అధ్వర్యంలో తెలంగాణ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి గారి అక్రమ అరెస్ట్ కు నిరసనగా నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగుల కోసం చేపట్టిన 24 గంటల ఉపవాస దీక్ష చేయనీయకుండ దీక్షను భగ్నం చేసి పోలీసులు రాష్ట్ర బీజేపీ ఆఫీస్ కు తరలించడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. తెలంగాణ లో నిరుద్యోగా యువత ను మోసం చేసి కెసిఆర్ పరిపాలన చేస్తున్నాడు అని తెలిపారు. నిరుద్యోగులకు ఇస్తానని చెప్పిన నిరుద్యోగ భృతి ఎక్కడ అని కెసిఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు రాబోయే కాలంలో తెలంగాణ లో బీజేపీ అధికారం లోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబు గౌడ్ జిల్లా ఓబీసీ మొర్చా కార్యదర్శి ఆశన్న మండల ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు శివశంకర్ మండల ఉపాధ్యక్షుడు రాం చందర్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు భద్రయ్య యువమోర్చ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమం



**టీ మీడియా, సెప్టెంబర్ 14, ఖిల్లా ఘనపురం:** ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ ఘనలింగేశ్వర భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయము నందు అమావాస్య సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించడం జరిగింది. వివిధ గ్రామాల నుండి రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. తధానంతరం మూసాపేట వాస్తవ్యులు ముచ్చర్ల యాదయ్య కుటుంబ సభ్యులు అన్నదానానికి 20వేల రూపాయలు ఇవ్వడం జరిగిందని అన్నదాన నిర్వాహకుడు కమ్మరి గోపి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

### అంతా అయోమయం దేవాలయం :

అసలు కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్టు ఎవరికి వస్తుందో తెలియక నియోజకవర్గం మొత్తం కార్యకర్తలు కాని, ఓటర్ లు కానీ, ఏమి చేయాలో తెలియక, ఏ గ్రూపుతో ఏ కార్యక్రమంలో పాల్గొనాలో అర్థం కాక, అయోమయంలో ఉన్నారు కానీ, ఈ మాజీ వ్యక్తి మాత్రం అధిష్టానం నా వైపే మొగ్గు చూపుతుందని నేను బాగా సీనియర్ నాయకుడని, నాకు టిక్కెట్ కచ్చితంగా ఇస్తారని, నిన్న కాక మొన్న కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన కొంతమంది వ్యక్తులు, నాపై దుష్ప్రచారం చేస్తూ నాకు టిక్కెట్టు రాకుండా అడ్డుపడుతున్నారని, కానీ ఈ వచ్చే ఎన్నికల్లో, ఎంతమంది ఎన్ని అడ్డంకులు పెట్టి ఎన్ని గ్రూపు రాజకీయాలు చేసినా నన్ను ఓడించటం వారి వల్ల కూడా కాదని గెలుపు మాత్రం నాదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. చివరికి ఏమి జరుగుతుందో నియోజకవర్గ ప్రజలు వేచి చూడాల్సిందే?

## బిజెపి నాయకులు ఘన సన్మానం



**టీ మీడియా, సెప్టెంబర్ 14, వనపర్తి బ్యూరో :** విదేశీ పర్యటన ముగించుకొని వనపర్తికి విచ్చేసిన సందర్భంగా ప్రముఖ న్యాయవాది బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్ కి భారతీయ జనతా పార్టీ నాయకులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జెబి వెంకట్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,చిత్తారి ప్రభాకర్, పట్టణ బిజెపి అధ్యక్షులు బచ్చు రాము, పట్టణ ప్రధాన కార్యదర్శి సూగూరు రామన్న, బిజెపి వనపర్తి మండల అధ్యక్షులు ఎద్దుల దేవేందర్ కందిరీగ తండా గ్రామ సర్పంచ్ అభినందనలు తెలిపారు.

## స్పందించి బస్సు సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు



**టీ మీడియా, సెప్టెంబర్ 14, గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లా, రామగిరి మండలం, సుందిల్ల, ముస్త్యాల గ్రామానికీ వచ్చే ఆర్టిసి బస్సు 20 రోజుల క్రితం నుండి బస్సు రావడం లేదని ముస్త్యాల గ్రామ సర్పంచ్ రామగిరి లావణ్య కు గ్రామస్థులు, విద్యార్థులు తెలుపడం తొ వెంటనే గ్రామ సర్పంచ్ రామగిరి లావణ్య గురువారం గోదావరిఖని డిపో కు వెళ్లి అసిస్టెంట్ మేనేజర్ తో మాట్లాడడం జరిగింది. విద్యార్థుల కు,గ్రామస్థుల కు బస్సు రాకపోవడం తో చాల ఇబ్బంది అవుతోంది సర్పంచ్ మాట్లాడడం జరిగింది అని సర్పంచ్ అన్నారు.బస్సు రాకపోవడం తో విద్యార్థులు స్కూల్ కు కాలేజీ కి వెళ్ళడం లేదు అని వెంటనే సుందిల్ల ముస్త్యాల గ్రామాలకు బస్సు నడపాలని సర్పంచ్ కోరగా వారు వెంటనే బస్సు డిపో వాళ్ళు బస్సు వేయడం జరిగిందనీ సర్పంచ్ అన్నారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపడం జరిగింది.

## లోన్ నిర్వాహకుల వేధింపులకు సింగరేణి కార్మికుడు మృతి



**టీ మీడియా, సెప్టెంబర్ 14, పెద్దపల్లి బ్యూరో :** ఆన్ లైన్ లోన్ నిర్వాహకుల వేధింపుల వల్ల ఓదెల మండలంలోని కొలనూరు గ్రామానికి చెందిన వంశీకృష్ణ సింగరేణిలో ఉద్యోగం చేస్తూ పెద్దపల్లిలో నివాసం ఉంటున్నాడు. అయితే ఆర్థిక అవసరాల నేపథ్యంలో ఆన్ లైన్ లో రుణం తీసుకొని ఇప్పటికే రెండున్నర లక్షలు చెల్లించినా, లోన్ నిర్వాహకుల వేధింపులకు తాళలేక గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సందర్భంగా వారి బంధువులు మాట్లాడుతూ లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల వల్లే వంశీకృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తున్నారు. అలాగే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పెద్దపెల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## యువకుడు దారుణ హత్య




**టీ మీడియా, సెప్టెంబర్ 14, రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి మండలంలో బుధవారం అర్ధరాత్రి దారుణం జరిగింది. మల్యాల గ్రామానికి చెందిన ఓ యువకుడిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు.వివరాల్లోకి వెళ్తే.. మల్యాల గ్రామానికి చెందిన పడిగెల నరేశ్(25) ఉపాధి నిమిత్తం ఐదేండ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. పది రోజుల క్రితమే అతను సొంతూరికి తిరిగొచ్చాడు. బుధవారం అర్ధరాత్రి నరేశ్‌పై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేశారు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి నరేశ్ ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివాహేతర సంబంధం కారణంగానే నరేశ్‌ను హత్య చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. నరేశ్ తన ఇంటికి సమీపంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఆమె భర్తే ఈ దారుణానికి పాల్పడి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

## దున్న లింగయ్య మృతి బాధాకరం

**- మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి**



**టీ మీడియా, సెప్టెంబర్ 14, నడిగూడెం :** మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ విశ్రాంత ఉద్యోగి దున్న లింగయ్య మృతి బాధాకరమని కోదాడ నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు నలమాల ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. గురువారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన లింగయ్య భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట మాజీ ఎంపీటీసీ పందిరి వెంకటరెడ్డి మండల కార్యదర్శి వేపూరి సుధీర్ తిరుపతమ్మ దున్న శ్రీనివాస్ పల్లపు శ్రీను ప్రతాప్ రెడ్డి శ్రీరాముల వెంకన్న కత్తి విజయ్ గంటె పంగు విజయ్ మౌలానా శ్రీకాంత్ దినేష్ దున్న రాజు, శ్రీను, మోసిన్ బేగ్,స్వామి బుచ్చయ్య సురేష్ ఆనంద్ నరేష్ దున్న వెంకన్న రాజా వంశీ క్రాంతి తదితరులు ఉన్నారు

# పార్లమెంటు సమావేశాల్లోనే...

# వర్గీకరణ బిల్లు పెట్టాలి




**టీ మీడియా, సెప్టెంబర్ 14, వనపర్తి బ్యూరో :** ఎస్సీ వర్గీకరణను విస్మరించడం అంటే సామాజిక న్యాయాన్ని పొడిచినట్లే.బీజేపీ ఇచ్చిన మాటకు కట్టుబడాలి. ఈ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి. రిలే నిరాహార దీక్షలు కొమ్ము చెన్నకేశవులు మహాజన ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.30 ఏళ్లుగా మాదిగల పోరాటానికి మద్దతు ఇచ్చి, మేనిఫెస్టోలో పెట్టుకొని, లేఖలు ఇచ్చి, తీర్మానాలు చేసి, అనేక వేదికల మీద మాట్లాడి మేం అధికారంలోకి వస్తే వందరోజుల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి, పదేళ్లు గడుస్తున్న పార్లమెంటులో సంపూర్ణ మెజార్టీ ఉన్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పెట్టకుండా దటవేత ధోరణిని అవలంబించిందని, బీజేపికి ఇచ్చిన మాటకు కట్టుబడి నైజం, నిజాయితి ఉంటే ఈపార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని మాదిగ డిమాండ్ చేశారు.ఈనెల 18 నుండి 22 వరకు కొనసాగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ దీక్ష శిబిరం సందర్భంగా గంధం గట్టయ్య మాదిగ రిటైర్డ్ పోస్ట్ మాస్టర్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త ఎరమోని యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, వనపర్తి జిల్లా కో ఇంచార్జీ హాజరై మాట్లాడుతూ 77 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ విధానం వలన దశాబ్దాల తరబడి ఏకపక్షంగా దోపిడీకి గురవుతున్నాయని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల కోటాలో ఎవరి వాటా వారికి న్యాయబద్ధంగా అందాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలని బిజెపి కాలయాపన చేయకుండ సత్వరమే నిర్ణయం తీసుకోవాలని అన్నారు. తమ పార్టీ పండిట్ దీన్ దయాల్ అంత్యోదయ స్ఫూర్తికి అనుగుణంగా నడిచే పార్టీ అని చెప్పుకునే మీరూ పండిట్ దిన్ దాయల్ స్ఫూర్తికి అనుగుణమైన వర్గీకరణపై నాంచివేత ధోరణి ఎందుకని ప్రశ్నించారు. వర్గీకరణను విస్మరించడం అంటే తమ పార్టీ అంత్యోదయ సిద్ధాంతానికి, సామాజిక న్యాయానికి సమాధి చేయడమేనని మండిపడ్డారు. ఎవరు ప్రస్తావించని అనేక సమస్యలను, అగ్రకులాలకు 10% రిజర్వేషన్లు, త్రిబుల్ తాలక్, జీఎస్టీ, నోట్ల రద్దు, పౌరసత్వం, బాబ్రీ, జమ్మూకాశ్మీర్ 371 తదితర వివాదాస్పద బిల్లులను పార్లమెంట్ లో ఆమోదింపజేసుకుంటు ఒక్కపైసా కూడా భారం పడని న్యాయమైన సమస్యపై మాత్రం తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ, మాదిగ ఉపకులాల చిరకాల ఆకాంక్షను సాకారం చేసేలా కీలక సమయంలో రాజకీయ పక్షాలు తమ పాత్రను తాము నిర్వర్తించాలని, ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి 29 ఏళ్ల మాదిగల సుదీర్ఘమైన పోరాటానికి న్యాయమైన ముగింపు నివ్వాలని కోరారు. ఈ దీక్షలు 22 వ తేదీ వరకు కొనసాగుతాయని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు దీక్షలు నిరసనలు ఆందోళనలతో ఉద్యమాలను కొనసాగిస్తామని, ఈ పోరాటాలు ఉధృతం కాకంటే ముందే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం లక్ష్మయ్య మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్, మీసాల నాగరాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ దేవని రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ చిన్నంబావి మండల అధ్యక్షులు మొలకలపల్లి పరశురాముడు మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గద్దమీద కుర్మయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ వీపనగండ్ల మండల కన్వీనర్ బంకల శీను మాదిగ, ఎమ్మార్పీఎస్ చెన్నారం గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### వెండి గిన్నెలతో మీడియాను..

# కాకా పట్టిన మాజీ ఎమ్మెల్యే

- **కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్ లో విందు ఏర్పాట్లు**
- **జర్నలిస్టులపై చులకనా భావం**

**టీ మీడియా, సెప్టెంబర్ 14, దమ్మపేట :** ఎన్నికల సమీపిస్తున్న వేళ ఆశావాహులు ఎవరికి వారే గెలుపు కోసం పదరాన్ని పాట్లు పడుతున్నారు. వివిధ వర్గాల ప్రజల్లోకి వారి అధిష్టానం ఇచ్చిన హామీలను ఊదరగొడుతూ ఓట్లు కొల్లగొట్టి అధికారం చేజిక్కించుకునేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. దానిలో భాగంగానే అశ్వారావుపేట ఓ పేరుగాంచిన మాజీ ఎమ్మెల్యే ఇంకో అడుగు ముందుకేసి మీడియాను ఆకట్టుకునేందుకు కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్ లో విందు భోజనాలు ఏర్పాటు చేసి, వెండి గిన్నెలతో మీడియాను తన వైపు తిప్పుకునేందుకు ఓ చిరు ప్రయత్నం చేశారు. గత ఎన్నికలలో మీడియాకు వ్యతిరేకంగా ఉన్నందువల్లే తాటి వెంకటేశ్వర్లు ఓడిపోయారనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. గతంలో జరిగిన తప్పిదాలు మరల జరగకూడదనే ఉద్దేశంతో విందు భోజనాలు గిఫ్ట్ ల పంపిణీ కార్యక్రమం చేపట్టారని తెలుస్తుంది. అప్పుడే కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఖరారు చేసినట్లు ముందుగానే ఊహించారో ఏమో కానీ మీడియాను ఆకట్టుకునేందుకు వడివడిగా పావులు కదుపుతున్నట్లు చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నుండి ఎనిమిది మంది అశ్వారావుపేట నియోజవర్గ ఎమ్మెల్యే టికెట్ కోసం అధిష్టానం వద్ద దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. అందులో ఎవరికి వారే టికెట్ మాకే వస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీలో కలిసి ఉండి విరోధులైన వారు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో కూడా రెండు గ్రూపులుగా ఎవరికి వారే టికెట్ మాకొస్తుందంటే మాకు వస్తుంది అంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మీడియాను మరింత ఆకట్టుకునేందుకు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఒక అడుగు ముందుకు వేసి విందు భోజనాలు, వెండి గిన్నెలతో తమ వంతు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారని తెలుస్తుంది. ఈ తాయిలాలతో మీడియాను ఆకట్టుకుని అధిష్టానం వద్ద అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.



**పలువురి జర్నలిస్టులపై చులకనా భావం తగునా.....?**

చిన్న పెద్ద తేడా చూపిస్తూ పలువురి పత్రిక విలేకరులపై చులకనా భావం చూపించడంతో వారి వ్యక్తిత్వానికి అద్దం పడుతోంది. రెండు సార్లు ఎమ్మెల్యే గా సేవలందించిన మాజీ ఎమ్మెల్యేకి ఎవరు విలేకరులో ఎవరు విలేకరి కాదో తెలియకపోవడం అచ్చర్యం కలిగించే విషయం, అగ్ర వర్ణ విలేఖరులకు పెద్ద పీట వేస్తూ. ఎస్సి ఎస్టీ,బీసీ మైనారిటీ విలేకరులపై చులకనా భావంతో చూడడంతో పలువురు పత్రిక విలేకరులు మనోభావాలు దెబ్బతినడంతో కొందరు విలేకరులు విందు నుండి వెళ్లిపోవడం గమనార్హం.ఈ విషయంపై పలువురు జర్నలిస్టులు స్పందిస్తూ మమ్మల్ని ఎందుకు పిలవాలి ఎందుకు అవమానించాలి, కనీసం ఎవరు ఏ పత్రికలో పనిచేస్తున్నారో కూడా తెలియకుండా విందు ఏర్పాటు చేసి మమ్మల్ని ఎందుకు ఆహ్వానించారు అని ఆవేదన వ్యక్తం చేశారు.



### రిపోర్టర్స్ తో..

# ముఖాముఖి

**టీ మీడియా, సెప్టెంబర్ 14, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని గ్రీన్ పార్క్ హొటల్ లో టీ మీడియా యాజమాన్యం ఎడిటర్ శనగపాటి మురళి కృష్ణ, సీఈవో నరేష్, ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో పనిచేసే టీ మీడియా రిపోర్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మీరు సంస్థ ద్వారా ఆర్థికంగా స్థిరత్వం పొందటానికి, ఇప్పటి వరకు ఏమి చేస్తున్నరు, మేము ఏమి చేశాం. భవిష్యత్తులో మీరు ఏమి చెయ్యాలి. మేము ఏమి చెయ్యాలి అన్న విషయాలు పై చర్చించడం జరిగింది.టీ మీడియా లో ఏటువంటి టార్గెట్ లు ఉండవు. అటువంటి విధానంకు మనం వ్యతిరేకం అన్నారు. విలేకరులు గా ఉన్న వారు ఆర్థికంగా స్థిరత్వం పొందకుండా, సంస్థ నడవడిక మంచిగా ఉండదు అన్నది మన విధానం. మేము మీ వద్దకు వచ్చాం మిమ్మల్ని మా దగ్గరికి రమ్మనడం లేదు అది ఆలోచించండి అన్నారు. వనపర్తి జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న ఖాళీలలో కొత్తగా చేరే వారు ఉంటే ఆహ్వానించండి అని వనపర్తి జిల్లా బ్యూరో గంధం రవికుమార్ కి సూచించారు. అనంతరం వనపర్తి జిల్లా కేంద్రానికి విచ్చేసిన టీ మీడియా యాజమాన్యానికి వనపర్తి జిల్లా రిపోర్టర్లు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపకం అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి రూరల్ రిపోర్టర్ అక్తర్, రేవల్లి రిపోర్టర్ నాగేశ్వర్, పెద్దమందడి రిపోర్టర్ అశోక్, చిన్నంబావి రిపోర్టర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### అది ఈడీ నోటీసు కాదు...

# మోడీ నోటీసు

**- ఎమ్మెల్సీ కవిత**




**టీ మీడియా, సెప్టెంబర్ 14, నిజామాబాద్ :** తనకు మోడీ నోటీసు వచ్చిందని, అది రాజకీయ కక్షతో పంపించిన నోటీసు కాబట్టి దానిపై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈడీ నోటీసును తమ పార్టీ న్యాయ విభాగానికి ఇచ్చామని, ఆ విభాగం ఎలా చెబితే అలా ముందుకెళ్తామని తెలిపారు. గురువారం ఆమె నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈడీ నోటీసులు అందాయని కవిత తెలిపారు. నోటీసులను పార్టీ లీగల్ సెల్‌కు అందజేశాం. వారి సూచనల మేరకు ముందుకు వెళ్తాం. రాజకీయ కక్ష్యతోనే నోటీసులు ఇచ్చినట్లు బలంగా నమ్ముతున్నాం. తెలంగాణలో రాబోయే ఎన్నికల వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని తనకు నోటీసులు ఇచ్చారు. గత ఏడాది కాలం నుంచి ఆ కేసులో దర్యాప్తు జరుగుతోందని, ఇంకెన్నాళ్లు ఆ విచారణ ఉంటుందో తనకు తెలియదు. 2జీ కేసులో కూడా ఇంత కాలం విచారణ జరగలేదనుకుంటా. రాజకీయ ఉద్దేశంతోనే కేసు సాగుతోందని, తెలంగాణ ప్రజలు దీన్ని సీరియస్‌గా తీసుకోరు. పార్టీ లీగల్ బృందం ఇచ్చే సలహాల మేరకు ముందుకు వెళ్తామన్నారు. తాము ఏ పార్టీతోనూ కలవలేదని, కేవలం తెలంగాణ ప్రజలు, భారత దేశ ప్రజలతో మమేకం అయ్యామన్నారు. దేశ ప్రజలు సీఎం కేసీఆర్‌ను కావాలనుకుంటున్నారని, దీంతో ఆ రెండు పార్టీలకు ఆ భయం పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. మేం ఎవరికీ బీ టీమ్ కాదన్నారు. అంతులేని టీవీ సీరియల్ తరహాలో విచారణ సాగుతున్నదని, అదేమీ పెద్ద విషయం కాదన్నారు. బీజేపీ ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. ప్రజలే ఆ పార్టీకి బుద్ధి చెబుతారని కవిత పేర్కొన్నారు.



## జగన్ చేసిన ప్రతితప్పునూ ప్రజాక్షేత్రంలో ఎండగడతాం

**- లోకేశ్**

**టీ మీడియా, సెప్టెంబర్ 14, రాజమహేంద్రవరం:** తమ అధినేత చంద్రబాబు సింహం లాంటి వ్యక్తి అని.. ఆయన దేనికీ భయపడరని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పష్టం చేశారు. చంద్రబాబు జైలు లోపల ఉన్నా సీఎం జగన్‌కు చెమటలు పట్టిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలో మీడియాతో నారా లోకేశ్ మాట్లాడారు."హైదరాబాద్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి చంద్రబాబు. సైబర్ టవర్స్ నిర్మించి లక్షల మందికి ఉపాధి కల్పించారు. ఆధారాలు లేకుండా స్కామ్ జరిగిందని ఆయనపై ఇప్పుడు కేసు పెట్టారు. చట్టాలను చుట్టాలుగా మారిస్తే సివిల్ వార్ మొదలుపెట్టాలి. చంద్రబాబు ఏ ఒక్క వర్గానికి కూడా ద్రోహం చేయలేదు. అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చి అమలు చేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేనతో కలిసి పోరాటం చేసే అంశంపై కమిటీ ఏర్పాటు చేస్తాం. చర్చల తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. రాబోయే రోజుల్లో కలిసి కట్టుగా పోరాడుతాం. జగన్ చేసిన ప్రతి తప్పును ప్రజాక్షేత్రంలో ఎండగడతాం" అని లోకేశ్ వెల్లడించారు.

## స్టూడెంట్స్ హెయిర్ స్టైల్ మార్చుకోవాలి

**- హెచ్ ఎం పలుసా శంకర్ గౌడ్**



**టీ మీడియా, సెప్టెంబర్ 14, పెద్దమందడి:** ప్రతి విద్యార్థి వారి హెయిర్ స్టైల్ మార్చుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మణిగిల్ల ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్ గౌడ్ విద్యార్థులకు సూచించాడు. సినిమా హీరోలను కాదు, జాతీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బుట్ట లాగా కటింగ్ చేహించుకున్నా, స్కూల్ స్టూడెంట్స్ ను దగ్గర ఉండి సింపుల్ గా కటింగ్ చేయించారు. ఈ సమాచారము తెలుసుకొని తల్లిదండ్రుల మేమూ ఇల్లు దగ్గర ఎంత చెప్పిన వినడం లేదు అని హెడ్మాస్టర్ మంచి పని చేసారు అనిసంతోషం తెలియపర్చారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణగా ఉండాలి. ప్రతి రోజు యూనిఫాం సింపుల్ కటింగ్కు హాజరు కావలని సూచించారు.

## చారిత్రక వస్తువులను జిల్లా మెజిస్ట్రేట్‌కు సమర్పించండి

**- వారణాసి కోర్టు**

**టీ మీడియా, సెప్టెంబర్ 14, న్యూఢిల్లీ :** జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో సైంటిఫిక్ సర్వే సందర్భంగా దొరికిన చారిత్రక వస్తువులను భద్రపరచాలని వారణాసి జిల్లా కోర్టు భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ)ని ఆదేశించింది. భద్రపరిచిన వస్తువులను జిల్లా మెజిస్ట్రేట్‌కు సమర్పించాలని తెలిపింది. మసీదు ప్రాంగణాన్ని రిజర్వ్ చేయడంతో పాటు, ఏఎస్ఐ సర్వే సమయంలో సేకరించిన చారిత్రక సాక్ష్యాలను భద్రపరిచేందుకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని హిందూ కమ్యూనిటీ కోర్టును కోరింది. అయితే సర్వే కోసం మసీదు ప్రాంగణంలో యంత్రాలు, ఇతర సామగ్రిని వినియోగించకూడదని ముస్లిం కమ్యూనిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. జ్ఞానవాపి మసీదులో ఏఎస్ఐ సర్వే చేపట్టేందుకు ఆగస్టులో అలహాబాద్ హైకోర్టు అనుమతించిన సంగతి తెలిసిందే. సర్వేను పూర్తి చేసేందుకు ఏఎస్ఐకి మరో నాలుగు వారాల అదనపు సమయాన్ని కోర్టు గతవారం మంజూరు చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 6లోగా నివేదికను సమర్పించాలని ఆదేశించింది

# నేడు 9 మెడికల్ కాలేజీలు ప్రారంభం

## ప్రారంభించనున్న సీఎం కేసీఆర్:



**టి మీడియా,సెప్టెంబర్ 14,హైదరాబాద్ బ్యూరో:** దేశ వైద్యవిద్య చరిత్రలో తెలంగాణ వరుసగా రికార్డులు సృష్టిస్తున్నది. నిరుడు ఒకేసారి 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభించి చరిత్ర సృష్టించిన ప్రభుత్వం ఈసారి ఏకంగా 9 కళాశాలల్లో తరగతులు ప్రారంభించేందుకు సిద్ధమైంది. 15న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయంశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామ జిల్లాల్లో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో ఏమూల ఎవరికి ఏ కష్టం వచ్చినా హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్ దవాఖానలే దిక్కయ్యేవి. వందల కిలోమీటర్లు ప్రయాణించి రావాల్సి వచ్చేది. సకాలంలో వైద్య సదుపాయం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు.మరోవైపు, తెలంగాణ బిడ్డలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారింది. ఉద్యమ సమయంలో ఇవన్నీ కండ్లారా చూసిన కేసీఆర్.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత వైద్య ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టిసారించారు. పేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందిస్తూనే మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. తొమ్మిదేండ్లలో 29 కాలేజీలు : తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో ఉన్నవి 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే. వీటిలో ఉస్మానియా (1946), గాంధీ (1954) మెడికల్ కాలేజీలు ఉమ్మడి ఏపీ ఆవిర్భావానికి ముందు నుంచే ఉన్నాయి. వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీని ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేస్తే ఉమ్మడి ప్రభుత్వం తీసుకున్నది. అంటే దాదాపు ఆరు దశాబ్దాల్లో ఉమ్మడి పాలకులు తెలంగాణలో ఏర్పాటు చేసింది కేవలం రెండే కాలేజీలు. అవి.. ఆదిలాబాద్‌లో రిమ్స్, నిజామాబాద్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ. మొత్తంగా చూస్తే కేవలం నాలుగు జిల్లాల్లోనే మెడికల్ కాలేజీలు ఉన్నాయి. కానీ, స్వరాష్ట్రంలో తొమ్మిదేండ్లలోనే సీఎం కేసీఆర్ 29 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారు. అంటే సగటున ఏడాదికి మూడు కాలేజీలు ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది ఏకంగా ఒకేసారి 9 మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం కానుండడం దేశ వైద్యవిద్య రంగంలోనే సరికొత్త చరిత్ర కానున్నది.

ఐదున్నర రెట్లు పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు :జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుతో రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు గణనీయంగా పెరిగాయి. 2014లో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కలిపి 850 సీట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఈ ఏడాది కొత్త కాలేజీలతో కలిపి ఆ సంఖ్య 3,790కి పెరిగింది. వచ్చే ఏడాది మరో 800 సీట్లు అందుబాటులోకి వస్తాయి. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్ల సంఖ్య 4,590కి పెరుగుతుంది. అంటే.. 9 ఏండ్లలోనే ఐదున్నర రెట్లు పెరుగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కలిపితే 2014 నాటికి 2,850 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే ఈ ఏడాదితో 8,340కు పెరిగాయి...



## బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

**టి మీడియా, సెప్టెంబర్ 14, హుజూర్ నగర్ :** పట్టణ బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణ పార్టీ అధ్యక్షులు చిట్యాల అమర్ నాథ్ రెడ్డి అధ్యక్షతన హుజూర్ నగర్ లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ దో%శీ%తగాని శ్రీనివాస్ గౌడ్, అట్లూరి హరిబాబు నర్సింగ్ వెంకటేశ్వర్లు పాల్గొనడం జరిగింది. పట్టణ పార్టీ అధ్యక్షులు చిట్యాల అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని మరొక సారి భారీ మెజార్టీతో గెలిపించి రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్క కార్యకర్త కేటాయించిన 100 ఓట్లను ఛాలెంజ్ గా తీసుకొని ప్రతి ఓటు బి ఆర్ఎస్ పార్టీ కార్ గుర్తుకు పడే విధంగా ప్రతి ఓటరు కు బి ఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలను వివరించి కర్యోన్ముకులను చేయాలని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రజా సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్ గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు దొంతి రెడ్డి పద్మ రాంరెడ్డి,, వేముల వెంకటేష్, , తురక నరసింహారావు, గుడెల్లి అంజయ్య, ఈసం బిక్షం మహిళ నాయకులు గూడెపు దీప, మామిడి మంగమ్మ, ఓర్సు కుమారి, నాగమణి, షేక్ రహిమ తదితరులు పాల్గొన్నారు.



## బీఎస్పీ లో భారీ చేరికలు

**టీ మీడియా, సెప్టెంబర్ 14, పెద్దపల్లి :** సుల్తానాబాద్ పట్టణంలోని సాయిరాం గార్డెన్స్ లో గురువారం బహుజన్ సమాజ్ పార్టీ సుల్తానాబాద్ మండల, పట్టణ బూత్ కమిటీ రివ్యూ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి ఉష సమక్షంలో ఓదెల, ఎలిగేడు,జూలపల్లి సుల్తానాబాద్ మండలాల నుంచి దాదాపు 500 మందికి పైగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కులపెద్ద మనుషులు, యువకులు, మహిళలకు పెద్ద ఎత్తున పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీ కండువా కప్పిన దాసరి ఉష,ఈ కార్యక్రమంలో బీఎస్పి రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య,జిల్లా అధ్యక్షులు గొట్టే రాజు,జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేష్ పటేల్,జిల్లా కార్యవర్గ సభ్యులు కంపల్లి బాబు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు నార్ల గోపాల్ యాదవ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్,అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, సుల్తానాబాద్ మండలం కోశాధికారి అల్లపు చంద్రశేఖర్, జుల్లపల్లి మండల అధ్యక్షులు సిపెల్లి కొమురయ్య,బీఎస్పీ నాయకులు కుతర్ల సంపత్,రచర్ల నవీన్, కళ్యాణం మహేష్, బండ నిఖిల్ కుమార్ యాదవ్,పిట్టల శివ, దొడ్డి అశోక్, శ్రీనివాస్ యాదవ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఖురాన్ పఠనం నిత్యం పటిస్తూ

## అల్లాః దీవెనలు పొందాలి

**- గౌస్ ఉద్దీన్**



**టి మీడియా, సెప్టెంబర్ 14, హుజూర్ నగర్ :** జామియా తుల్ మోమినాత్ ఖాశ్మియా బాలికల అరబ్బీ పాఠశాల హుజూర్ నగర్ వ్యవస్థాపకులు మౌలానా మొహమ్మద్ అబ్దుల్ రహీం గారి ప్రథమ పుత్రుడు మహమ్మద్ అబ్దుల్ హాలీం పవిత్ర ఖురాన్ గ్రంథం కంఠస్థం చేసిన శుభ సందర్భంగా మదర్సా జామియతుల్ మోమీనాత్ హుజూర్ నగర్ శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సన్మాన ఉపన్యాస కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కోదాడ మౌలానా అబ్దుల్ ఖదిర్ సాహెబ్ హుజూర్ నగర్ మహమ్మద్ గౌస్ ఉద్దీన్ లు ప్రసంగిస్తూ... ప్రపంచ మానవాళి సక్రమ మార్గంలో పయనించాలని, ప్రేమ ఆప్యాయత అనురాగం నీతి నిజాయితీలతో మానవ సేవ చేస్తూ ఖురాన్ పఠనం నిత్యం ఆచరిస్తూ అల్లా కు ప్రీతిపాత్రులు కావాలని, తల్లిదండ్రులను గురువులను గౌరవిస్తూ పూజించాలని వారి దీవెనలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఖురాన్ కంఠస్థం చేసిన అబ్దుల్ హాలీం బాలుడిని అభినందించి సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఇంటి నుంచి ఖురాన్ కంఠస్థం చేసే హాఫీజు లు తయారు కావాలని అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని హాఫీజు లు ఉలమాలు హుజూర్ నగర్ ముస్లిం మైనార్టీలు సయ్యద్ జావిద్ మహమ్మద్ గౌస్ ఎండి ఖాజామీయా షేక్ దస్తగీర్ వివిధ పార్టీల మైనార్టీ నాయకులు షేక్ మన్సూర్ అలీ, అధిక సంఖ్యలో పట్టణ ముస్లిం మైనార్టీలు మహిళలు పాల్గొన్నారు.

## కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం



**టి మీడియా, సెప్టెంబర్ 14, ఓదెల :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు కారంగుల శ్రీనివాస ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి,గంగవరపు కిషన్ రెడ్డి ని అక్రమంగా అరెస్టు చేయడం ఖండిస్తూ నేడు ఓదెల మండల కేంద్రంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది, అనంతరం కారెంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని ఒక్కరోజు ధర్నా కార్యక్రమం చేపడితే రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ని అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడం ఇది బిఆర్ఎస్ ప్రభుత్వానికే చెందుతుందని రానున్న రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు బొంద పెడతారని అలాగే నిరుద్యోగ భృతి ఇయ్యకుండా మయమటలు చెప్పిన కేసీఆర్ ని రానున్న ఎలక్షన్లలో ఓడగొట్టాలని నిరుద్యోగులు కంకణం కట్టుకొని ఉన్నారని అన్నారు అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి మంజూరు చేయకపోవడం చాలా సిగ్గుచేటని అన్నారు త్వరలోనే నిరుద్యోగ భృతి మరియు ఉద్యోగ అవకాశాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల బిఆర్ఎస్ ఎమ్మెల్యే లను గ్రామాల్లో తిరగకుంట అడ్డుకుంటామని బిజెపి ఓదెల మండల శాఖ తరపున హెచ్చరిస్తున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో ఓదెల మండల బీజేపీ అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్ ఎంపీటీసీ కొలనూర్, మండల ఉపాధ్యక్షులు ఎంబడి మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి తీర్థాల కుమారస్వామి,ఖుద్దే రాజన్న, బోడకొండ సతీష్, మార్క శ్రీనివాస్, మెరుగు సారంగం, రామినేని సతీష్, రెడ్డిరాజుల సాయి తదితరులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

### రాష్ట్ర అధ్యక్షుల అరెస్టును

## ఖండిస్తున్న నాయకులు



**టీ మీడియా, సెప్టెంబర్ 14, రేవల్లి :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ గురువారం మండల అధ్యక్షులు మాచర్ల అజయ్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. నిరుద్యోగుల సమస్యలు వారి పట్ల ప్రభుత్వ విధానంను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా 24 గంటల దీక్ష చేపట్టిన కిషన్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దారుణం. కేసీఆర్ ప్రభుత్వం నిరంకుశ విధానాన్ని అవలంబిస్తూ నిజాం దొర లేక ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న ఈ తెరాసను ప్రజలు బొంద పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఒగ్గు పరిశరం, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, కిషన్ మోర్చా, దళిత మోర్చా అధ్యక్షులు జమ్ములు, తిరుపతయ్య, స్వామి, రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు రక్షణ కోట్ లు ఇవ్వాలి

**- తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు**

**- మద్దెల శ్రీనివాస్ డిమాండ్**



**టీ మీడియా, సెప్టెంబర్ 14, గోదావరిఖని :** సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులందరికీ వర్షం, చలి,వల్ల డ్యూటీ ల వద్ద ఇబ్బందులు కలగకుండా రక్షణ కోసం వర్షం, చలి కోట్ లను ఇవ్వాలని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్ గురువారం డిమాండ్ చేశారు. ఆర్జి 1,ఆర్జి 2, ఆర్జి 3 లలో పనిచేస్తున్న వివిధ సంస్థలలో సెక్యూరిటీ సిబ్బంది ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని సింగరేణి యాజమాన్యం వీరిపై ప్రత్యేక శ్రద్ధ వహించి రావలసిన హక్కులని పరిష్కరించి వీరికి భరోసా కల్పించాలని, సింగరేణి వ్యాప్తంగా సింగరేణి ఆస్తులను కాపాడుతున్న ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి ప్రత్యేక అలవెన్స్ కల్పించాలని, వీరిని ఐస్కిడ్ కార్మికులుగా గుర్తించి న్యాయం చేయాలని యజమాన్యం బరోసా కల్పించాలి, సింగరేణి ఎస్ అండ్ పిసి వారు సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా వర్షము చలి కోట్ లను ఇప్పించ వలసి ఉన్నదని అందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర విభాగాల కార్మికులకు చెల్లించినట్టుగా మెడికల్ కు సంబంధించిన డబ్బులను రియంబర్స్మెంట్ చేసి ప్రైవేట్ గార్డులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేయింబవళ్లు సింగరేణి ఆస్తులను కాపాడటంలో, భద్రతను కల్పించడంలో నేడు ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల శ్రమ కీలకంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్,సురేష్,రాజు సుదర్శన్,సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## నిజాం నవాబులను తరిమికొట్టిన ఎర్ర జెండ

**- కోడం స్వామి**



**టి మీడియా, సెప్టెంబర్ 14, ఓదెల :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ఓదేల మండల కేంద్రంలో సిపిఐ మండల పార్టీ కార్యదర్శి కోడం స్వామి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. సిపిఐ మండల పార్టీ కార్యదర్శి కోడం స్వామి మాట్లాడుతూ.. భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ వెట్టి చాకిరి విముక్తి కోసం 5 వెల మంది సిపిఐ కార్యకర్తలు రక్త తర్పణం చేసి కరుడుగట్టిన నిజాం నవాబులను తరిమికొట్టి తెలంగాణను భారతదేశంలో విలీనం చేసి పది లక్షల ఎకరాల భూమిని ప్రజలకు పంచి నిజాం నవాబును నిరంకుశ పాలన నుంచి 3 వెల గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐ పార్టీ కె దక్కుతుందని, 1947 సెప్టెంబర్ 11న రావి నారాయణరెడ్డి,బద్దం ఎల్లారెడ్డి, మొహిద్దిన్ పిలుపుతోని సాయిధ పోరాటాల ఫలితంగానే నిజాం నవాబు పాలన అంతమైందని, ఈ సందర్భంగా తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మండల సహాయ కార్యదర్శి పల్లెగట్టయ్య,జిల్లా కౌన్సిల్ సభ్యులు సూత్రాల స్వామి,ఒదెల గ్రామ శాఖ కార్యదర్శి సమ్మెట నాగేందర్, పొత్కపల్లి గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మల సదయ్య, హరిపురం గ్రామ శాఖ కార్యదర్శి సమ్మయ్య, నాంసంపల్లి పార్టీ నాయకులు ఇరవేని సమ్మయ్య,శనిగరపు మల్లయ్య,ఎండి పాషా మియా తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ ను సుందరంగా తీర్చిదిద్దుతాం



**టీ మీడియా, సెప్టెంబర్ 14, మహబూబాబాద్ :** మహబూబాబాద్ ను సుందరంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం మహబూబాబాద్ మున్సిపల్ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు స్థానిక శాసనసభ్యులు బాణోత్ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి తో కలిసి కలెక్టర్ సందర్శించి పనులను పర్యవేక్షించారు. తొలుత మహబూబాబాద్ పట్టణం లోని నెహ్రూ సెంటర్ నుండి పత్తిపాక రహదారి విస్తరణ పనులు పరిశీలిస్తూ ప్రజాప్రతినిధులు, వర్తకులు సహకరించాలని కోరారు. వివేకానంద విగ్రహం నుండి ఈదుల పూస పల్లి వెళ్లే రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.తదనంతరం ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి పనులు పరిశీలిస్తూ పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఐ డి ఓ సి వద్ద కురవి రోడ్డులో నిర్మిస్తున్న నూకల రామచంద్రారెడ్డి విగ్రహ స్థాపన పరిశీలించారు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ ఫరీద్,కౌన్సిలర్ వెంకన్న , 34 వార్డ్ కౌన్సిలర్ గుండా స్వప్న పోతురాజు, మున్సిపల్ డి ఈ ఉపేందర్ జిల్లా అధికారి అనిల్ కుమార్ ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభల ద్వారా నిజమైన లబ్ధిదారుల ఎంపిక జరగాలి



**టీ మీడియా, సెప్టెంబర్ 14, బోనకల్లు:** గృహలక్ష్మి ఇల్లు, దళిత బంధువు, బీసీ బందు, మైనార్టీ బందు ,లక్షరోపు రైతులకు రుణమాఫీ అర్హులైనటువంటి వాళ్లకి ఇవ్వాలని ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరావు మాట్లాడుతూ అధికార పక్షం కార్యకర్తలకి గృహలక్ష్మి,దళిత బంధువు, మైనార్టీ బందు ఇస్తున్నారని నిజమైన అర్హులకు ఇవ్వట్లేదని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామ సభల ద్వారా నిజమైన లబ్ధిదారుల ఎంపిక జరగాలని, అలా జరగకుండా అధికారపక్షం వారు వారికి అనుకూలమైన వారికి, అర్హత లేనివారికి సంక్షేమ పథకాలు ఇస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని ప్రభుత్వ అధికారులు గుర్తించాలని ఇకనుండి గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక జరగనట్లయితే సిపిఎం తమ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వాన్ని,అధికారులను హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం,పార్టీ మండల కమిటీ సభ్యులు,శాఖ కార్యదర్శులు,శాఖ సభ్యులు, ఎంపీటీసీలు,సర్పంచులు సంక్షేమ పథకాల నిజమైన లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు పర్మినెంట్ పత్రాలు అందజేసిన ఎంపీపీ



**టీ మీడియా, సెప్టెంబర్ 14, అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అశ్వారావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అశ్వారావుపేట మండలంలో 14 మంది పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులర్ చేస్తూ పె స్కేల్ వర్తింప జేస్తు వచ్చిన ఆర్డర్స్ కాపీలను కార్యదర్శులకు అందజేసిన అశ్వారావుపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎంపీపీ జల్లిపల్లి.శ్రీరామమూర్తి. ఈ సందర్బంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు పంచాయితీ కార్యదర్శులకు ఇచ్చిన మాట ప్రకారం 4 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క పంచాయతీ కార్యదర్శికి రెగ్యులర్ చేస్తానని పే స్కేల్ ను వర్తింపజేస్తానని మాట ఇచ్చారు,ఇప్పుడు చేసి చూపించారని, తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు కెసీఆర్ గారూ మాట ఇస్తే తప్పరని మరోసారి రుజువు అవిందని, కెసీఆర్ చెప్పారంటే చేసి చూపిస్తారని, ఆయన తెలియజేశారు. అలాగే కార్యదర్శులకు రెగ్యులర్ చేస్తూ ఇచ్చిన ఆర్డర్స్ పత్రలను మన అశ్వారావుపేట నియోజక వర్గ శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వర రావు ఆదేశానుసారం గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు అర్హులైన కార్యదర్శులు 14 మందికి పత్రాలను అందజేయటం జరిగిందని అశ్వారావుపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు ఎంపిడిఒ శ్రీనివాస రావు,%వశీ% హరికృష్ణ, కార్యదర్శి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలి

**- సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను**

**టీ మీడియా, సెప్టెంబర్ 14, తిరుమలా యపాలెం :** సెప్టెంబర్ 16వ తేదీన ఖమ్మం కళాక్షేత్రంలో జరిగే తెలంగాణ తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఉమ్మ శ్రీను పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మేడిద పల్లి ఏలువారు గూడెం దమ్మాయిగూడెం పిండిప్రోలు వేదుల్ల చెరువు గ్రామాలలో సిపిఎం ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొమ్ము శ్రీను మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు రు వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఈనెల 16న సాయంత్రం ఐదు గంటలకు భక్తురాందాస్ కాలక్షేత్రంలో సభ నిర్వహిస్తున్నట్లు యొక్క సభకు జిల్లా వ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ యొక్క సందర్భంగా మండలంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు ఎర్ర సొక్క ఎర్ర చీరలు ధరించి కదలి రావాలని సాయంత్రం నాలుగు గంటలకు తిరుమలాయపాలెం మండల గజ్జల వెంకటయ్య భవనం వద్ద నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు యొక్క కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, నాగాటి సురేష్, బందారపు సైదులు, ఉపేందర్ రెడ్డి సయ్యద్ పత్తే అహ్మద్ మాచర్ల రాజశేఖర్ దిండు మంగపతి బోడపట్ల సతీష్ షేక్ రఫీ పొదిలా నగేష్ రావుల వెంకట రామిరెడ్డి నరేష్ రెడ్డి దేవరం రాంరెడ్డి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**- పద్మావతి రెడ్డి**



**టి మీడియా, సెప్టెంబర్ 14, గరిడేపల్లి :** గరిడేపల్లి మండలం, కల్మలచెరువు గ్రామంలో, ఇటీవల ట్రాక్టర్ బోల్తా పడి ప్రమాదం జరిగిన కుటుంబాలను,కోదాడ మాజీ ఎమ్మెల్యే టి పి సి సి ఉపాధ్యక్షురాలు,ఉత్తమ్ పద్మావతి రెడ్డి పరామర్శించారు. ప్రమాదంలో మరణించిన బిల్లా మనిషా కుటుంబాన్ని పరామర్శించి, వారికి అన్ని విధాలుగా తోడుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్మలచెరువు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసాల యోహాన్, గ్రామ సర్పంచ్ మూలగుండ్ల విజయ సీతారాం రెడ్డి గారు, గరిడేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాం రెడ్డి ,మాజీ జెడ్పిటిసి బచ్చలకూరి మట్టయ్య , గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడితే... ఉరి తీయండి

## కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు తూడి మేఘారెడ్డి

**టీ మీడియా, సెప్టెంబర్ 14, వనపర్తి బ్యూరో :** నన్ను నమ్ముకుని నా వెంట ఉండే వారికోసం నా చివరి శ్వాస వరకు అండగా ఉంటా అని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు తూడి మేఘారెడ్డి అన్నారు.రేపు జరగబోయే ఎన్నికల్లో తనకు సహకరించి తనను ఆశీర్వదించాలని మీ ఆశీర్వాదాలతో నేను అందలమెక్కి అవినీతికి పాల్పడినట్లు మీరు గుర్తిస్తే ఇదే చౌరస్తాలో ఉరి తీయాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు తూడి మేఘరెడ్డి అన్నారు.ఈనెల 17న తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ఆధ్వర్యంలో జరిగే కాంగ్రెస్ విజయభేరి సన్నాహక సభలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి, మేఘ రెడ్డిలు పాల్గొని మాట్లాడారు.గురువారం ఉదయం వనపర్తి పట్టణంలోని చింతల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజ చేసి అక్కడి నుంచి నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాదయాత్రగా బయలుదేరి గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, రాజీవ్ గాంధీ చౌక్, ఇందిరా గాంధీ చౌక్, భగీరథ చౌరస్తా మీదుగా లక్ష్మీ కృష్ణ కళ్యాణ మండపం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర యువజన అధ్యక్షులు శివసేన రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాష్ట్రవ్యాప్తంగా విజయం సాధిస్తుందని వనపర్తి నియోజకవర్గం లోను కాంగ్రెస్ పార్టీని విజయం సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచించిన వ్యక్తికే ఎమ్మెల్యే సీటు వస్తుందని ఎవరికి సీటు వచ్చినా తామందరం కలిసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మేఘారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తామే అభివృద్ధి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 10 జిల్లాలుగా ఉన్న రాష్ట్రం 33 జిల్లాలుగా ఏర్పడిందని ఈ 33 జిల్లాల్లోనూ అన్ని జిల్లాలకు మెడికల్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు, అన్ని మంజూరు అవుతున్నాయని కేవలం వనపర్తి జిల్లాకు మాత్రమే మంజూరు కావడం లేదని అదేదో తామే అభివృద్ధి చేశామని చెప్పడం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు.రోడ్ల విస్తరణ చేశామని చెప్పుకునే అధికార పార్టీ నాయకులు 2018 నాటికే నాగర్కర్నూల్, కొత్తకోట లాంటి పట్టణాల్లో రోడ్ల విస్తరణ పూర్తయిందని పట్టణ అభివృద్ధిలో భాగంగా చేసిన పనులను సైతం తామేదో చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.రోడ్ల విస్తరణ లో భాగంగా రోడ్డు కటింగ్ వ్యవహారంలో ప్యాకేజీల వ్యవహారం నడిపి తమ జేబులు నింపుకున్నారే తప్ప నిరుపేద కుటుంబాలైన చిరు వ్యాపారులకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు.గత 50ఏళ్ల క్రితమే వనపర్తి నియోజకవర్గం విద్యావంతంగా అభివృద్ధి చెందిందని ఆనాడే వనపర్తి లో పైసలు ముద్రించే యంత్రాలు, విద్యుత్ తయారి యంత్రాలు ఆర్టీసీ డిపో కూడా ఉండవని పేర్కొన్నారు.నేను అభివృద్ధి చేశాను అంటూ తాత్కాలికా అనందం పొంది ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు కూడా తమ పేరును పెట్టుకోవడం సిగ్గుచేటు అన్నారు.వనపర్తి రాజా రామేశ్వరరావు తనకున్న ఆస్తులను ప్రభుత్వ పరంగా చేసిన తన పేరు ఎక్కడ కూడా వాడుకోలేదని గుర్తు చేశారు.



ఉన్న నీళ్ల ట్యాంకులకు రంగులేసి మిషన్ భగీరథ పనులు చేశామని తెలంగాణ వచ్చిన తర్వాతే మీరందరూ నీళ్లు తాగుతున్నారన్నట్లుగా వ్యవహరించడం తెలంగాణ పార్టీ నాయకులకే చెల్లిందని ఎద్దేవా చేశారు. కానాయపల్లిలోని శంకర సముద్రం వద్ద ఇన్నర్ కెనాల్, ఔటర్ కెనాల్ కు సంబంధించిన పనులు అప్పటికే పూర్తయ్యాయని రింగుబండ్ పనులు పూర్తయితే దాని నుంచి నీళ్లు సరఫరా అవుతాయన్న కోణంలో తాను రింగుబండ్ పనులు పూర్తి చేస్తే వాటి ద్వారా పానగల్ మండల వరకు నీళ్లు వెళ్ళాయని పనులు చేసిన తనకు మాత్రం ఎటువంటి బిల్లులు అందకపోగా తన పేరు మీద కూడా బిల్లులు చేసుకొని తిన్న ఘన చరిత్ర ఉన్న నాయకులు వనపర్తి లో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల ముందు ఉన్న ఆస్తుల వివరాలు నేడు అక్రమంగా సంపాదించిన ఆస్తుల వివరాలు ఏ విధంగా పెరిగాయని ఆయన ప్రశ్నించారు.అవినీతి కార్యకలాపాల్లో సహకరిస్త లేరన్న కలెక్టర్లకు అధికారులకు రాత్రికి రాత్రే ఏ విధంగా ట్రాన్స్ఫర్ అయ్యాయని వీటన్నింటికీ కారణం ఎవరు అన్నది అందరికీ తెలిసిన విషయమేనని పేర్కొన్నారు.

అవినీతి అక్రమాలకు పాల్పడుతూ భూకబ్జాలకు తెరలేపారని నాయకులతో పాటు తోక నాయకులు కూడా భూకబ్జాలకు పాల్పడ్డారని ఈ క్రమంలో నిరుపేదలు నిరుపేదలు గానే మిగిలిపోయారని ఆయన అన్నారు.వీరాయపల్లి గ్రామంలోని వేరుశనగ పరిశోధన కేంద్రం పనుల్లో తాను పనులు చేస్తే తన అనుచర ఘనం మీద నిధులు మంజూరు చేయించుకున్న ఘనత బీఆర్ఎస్ నాయకులకి దక్కిందని ఆయన విమర్శించారు.పాలమూరు రంగారెడ్డిలో భాగమైన ఏదుల రిజర్వాయర్కు సందర్శనార్థం ప్రతినిత్యం ఎందరినో పంపుతున్న నాయకుడు ఆ పాలమూరు రంగారెడ్డి వల్ల వనపర్తి నియోజకవర్గ పరిధిలోని గ్రామాల ఆయకట్టుకు ఎంత నీరు వస్తుందో అని చెప్పాలని డిమాండ్ చేశారు. సందర్శకులను ఏదుల రిజర్వాయర్ కాకుండా తాను కబ్జా చేసిన స్థలాలకు పంపించి ఈ విధంగా చూపించాలని పేర్కొన్నారు.ఎండాకాలం వర్షాకాలం చలికాలం ఇకపై వచ్చేది మన కాలమేనని ఎవరు కూడా ఎక్కడ అధైర్య పడవద్దని మీ వెనకాల నేను ఉండి ఎక్కడి వరకైనా మీకోసం వస్తానని ఆయన నాయకులు కార్యకర్తలకు భరోసా కల్పించారు.ప్రస్తుతం అధికార మదంతో ఉన్న బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలను నాయకులను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తారని వారు అంతకుమించి మనను ఏమి చేయలేరని అందరూ కూడా ధైర్యంగా నిలబడి ఎదురు తిరిగి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రానున్న కాలంలో ఈ అవినీతి పాలను దూరం చేయవచ్చునని ఆయన వారికి సూచించారు. అధినాయకత్వన్ని తనను ఎదిరించే ధైర్యం ఎవరికీ లేదని చెప్పుకునే నాయకుడు ఇసుక ట్రాక్టర్ల వద్ద కూడా కమిషన్లు వసూలు చేయడం విడ్డూరం అన్నారు.బిఅర్ఎస్ కండువా కప్పుకుంటేనే తమకు పనులు ఇస్తామని, తమ పనులు కొనసాగనిస్తామని ఎంతో మందిని ప్రలోవ పెడుతూ బెదిరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఎక్కడ ఎవరు కూడా లొంగాల్సిన అవసరం లేదని ఆరిపోయే ద్వీపానికి వెలుతురు ఎక్కువ అన్నట్లు ఓడిపోయే నాయకుడు ఇలాంటి దుచ్చెర్లకు పాల్పడుతూనే ఉంటారని ఎక్కడ కూడా ఎవరు ధైర్యం కోల్పోకూడదు అని ఆయన నాయకులకు కార్యకర్తలకు ధైర్యాన్ని ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అమలయ్యాక నిరుద్యోగ యువతను తాగుడుకు బానిసకుచేసింది తప్ప ఉద్యోగ కల్పన ఎక్కడ కూడా చేయలేదన్నారు. ఈ క్రమంలో 3వేల వైన్ షాపులు 60 వేల బెల్ట్ షాపులు కొనసాగిస్తూ నిరుద్యోగ యువత బతుకును బజారుపాలు చేస్తున్న పార్టీ టిఆర్ఎస్ పార్టీ అన్న ఆయన విమర్శించారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని ప్రజలను మభ్యపెడుతున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను చూపించాలని, డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చిన గ్రామాలలో తాము ఓట్లు కూడా అడగమని ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన గ్రామాలలో వారు కూడా ఓట్లు అడగరాదని ఆయన సవాల్ విసిరారు. దళిత బంధు బీసీ బందు అంటూ ప్రొసీడింగులు జారీ చేసి ప్రజలను మభ్యపెట్టే నాయకులు వారికి నిధులు మంజూరు చేసి దళిత బంధు బీసీ బందు ఇచ్చామని చెప్పుకుంటే బాగుంటుందని ఇతర చేశారు.వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించుకునేందుకు ఐదు లక్షల రూపాయలు, ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, ప్రతి ఇంటికి 500 కే సిలిండర్, ప్రతి మహిళ రాష్ట్రంలో ఎక్కడికైనా తిరిగి ఎందుకు బస్సులో ఉచిత ప్రయాణం,చదువుకునే విద్యార్థులకు స్కూటీల పంపిణీ. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లతోపాటు ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్లకు నిధుల మంజూరు లాంటి ఎన్నో పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతుందని ప్రస్తుతం పింఛనందుకునే ప్రతి ఒక్కరికి కుటుంబంలో ఎంత మంది ఉన్నా వారికి ఒక్కొక్కరికి 4000 పెన్షన్ మంజూరు చేసేదే కాంగ్రెస్ పార్టీ అని ఆయన పేర్కొన్నారు.ఈనెల 17వ తేదీన తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి శ్రీమతి సోనియా గాంధీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే కాంగ్రెస్ విజయభేరి కార్యక్రమానికి ప్రతి గ్రామ గ్రామం నుంచి భారీ ఎత్తున తరలిరావాలని వారికి అన్ని ఏర్పాట్లు తాము చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.తన విజయానికి తనతో పాటు నడిచే అందరిని కూడా ఎల్లవేళలా గుర్తుంచుకుంటానని నాతో పాటు ఉండే అందరికీ కూడా తాను అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ అధ్యక్షులు రవికుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు రాధాకృష్ణ, వెంకటేష్ బ్రహ్మచారి, సర్పంచులు, శ్రీనివాస్ రెడ్డి, రాధాకృష్ణ, రమేష్ యాదవ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సత్య రెడ్డి, సతీష్, రాములు, అచ్యుత రామారావు, రమేష్ గౌడ్, రంజిత్,వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, సురేందర్ గౌడ్, శంకర్ నాయక్, శ్రీహరి గట్టు యాదవ్, సతీష్ యాదవ్ , ఎంపీటీసీలు, మాజీ ఎంపిటిసిలు, సింగిల్ విండో డైరెక్టర్లు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

## - 32వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

**టీ మీడియా, సెప్టెంబర్ 14, రేవల్లి :** మండలంలో ని తలుపునూరు గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో కలపాలని 32 రోజులుగా రిలే నిరసన దీక్షలు చేస్తున్న గ్రామస్తులకు గురువారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి. బోర్ల భీమయ్య మాట్లాడుతూ తలుపునూరు గ్రామాన్ని నాగర్ కర్నూలు జిల్లాలో కలపడానికి మా వంతు కృషి చేస్తామని తెలియజేశారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్యల పట్ల స్పందించి అన్ని సమస్యలను పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారు. గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో కలపడానికి గ్రామస్తులంతా తీర్మానించుకొని మంత్రిగారి దృష్టికి తీసుకువెళతామని, మంత్రి గారిచే హామీ ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సంఘీభావం కార్యక్రమంలో మండల ఎంపీపీ బంకల సేనాపతి, పీఏసీఎస్ చైర్మన్ రఘు, తలుపునూరు ఎంపీటీసీ చిన్న కురుమత్ రెడ్డి, సర్పంచ్ నరేందర్ రెడ్డి, సురేష్, శివరాంరెడ్డి, నాగపూర్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అప్పారావుపేటలో

# ప్రమాదాల మలుపు




**టీ మీడియా, సెప్టెంబర్ 14, దమ్మపేట :** భద్రాద్రి కొత్తగూడెం దమ్మపేట మండలం అప్పారావుపేట గ్రామంలోనే మూలమరపు కేంద్రంగా మారింది. గురువారం మితిమీరిన వేగంతో పామాయిల్ పీచుతో ట్రాక్టర్ మలుపు వద్ద బోల్తా కొట్టడంతో మరొకసారి ఉలిక్కిపడ్డారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆర్ అండ్ బి అధికారులు స్పీడ్ బ్రేకర్ వేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.